ఆవేశంతో  మాట్లాడుతున్న కిరీటి రెప్పవేయకుండా హిస్టిరిక్‌గా నిలబడ్డ శిల్పను చూడగానే ఆగిపోయాడు.

తల చేదిరి పిచ్చిదానిలా చూస్తూ  కన్నీళ్ళు కార్చుతున్న శిల్ప ఆకలేస్తుందని చాటుగా తాయిలం దాచేసిన పదేళ్ళ పసిపాపలా అనిపించింది.

కోపం స్థానంలో జాలి చోటు చేసుకుంది.

"శిల్పా!" తమాయించు కోలేక ఆప్యాయంగా ఆమె శిరస్సుపాయ చేయి వేయబోయాడు.

కోపంతో రెండడుగులు వెనక్కి వేసింది.

నానీ నిక్షేపంగా వున్న విషయం కన్యకు ఫోన్ చేసి  ఉదయాన్నే పంపుతానని చెప్పి తిరిగి వచ్చాడు.

క్రోధారుణ నేత్రాలతో తీక్షణంగా  తనవైపే చూస్తున్న  శిల్ప పగలబోతున్న అగ్ని పర్వతంలా వుంది.

మతి భ్రమించిన దానిలా ప్రవర్తిస్తున్న శిల్ప మానసికంగా ఎంత దిగులు పడుతున్నదీ అర్థంచేసుకున్నాడు కిరీటి .

అభిమానంతో ఆమెను హత్తుకుని అన్నింటికీ నేనున్నానని హామీ యివ్వాలనుకున్నాడు.

అడుగు ముందుకు వేసిన కిరీటి "ఆగండి" అంటూ శిల్ప హూంకరించటంతో ఠక్కున ఆగిపోయాడు.

"ఏమిటీ... ఆవిడగారి బాధ తట్టుకోలేక వెంటనే ఫోన్ చేసి మరీ చెప్పారా.... అందరూ అలాగే బాధపడతారని ఎందుకనుకోరు... ఏమిటి ఆమె గొప్ప... నాకంటే యెందులో ఉన్నతురాలు..." పళ్ళు నూరుతూ పదాల్ని ఒత్తి పలుకుతూ అంది.

కన్య గురించి అంతా చెప్పాలనుకున్నాడు. కన్యకూ తనకీ అటువంటి సంబంధం ఏదీలేదని ఏ  ప్రమాణమైనా చేయాలని సంకల్పించుకున్నాడు.

"శిల్పా.... నన్ను నమ్ము.... నాకు రెండు నిమిషాల టైమివ్వు. నీకు అంతా చెప్పేస్తాను" అర్థించాడు.

"లేదు ... మీ కట్టు కథల్ని వినే ఓపిక నాకు లేదు.... వెళ్ళిపోండి... ఇక్కడనుంచి బయటకు వెళ్ళండి."

"ప్లీజ్ ... శిల్పా..."

"వెళ్ళండీ..." ఉరిమినట్టుగా  అరిచింది.

జంకినట్టుగా వెనక్కో అడుగు వేశాడు.

"అలా చూడకండి. అలా చూసి నన్ను పిచ్చిదాన్ని చేయకండి ." బావురుమంటూ పరుపుపై బోర్లాపడి పోయింది.

ఉదయాన్నే నానీని స్కూల్‌కు తయారు చేయటం, నానీ స్కూలుకు వెళ్ళాక గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవటం తప్ప కన్య జీవితంలో చైతన్యం లేదు.

అంతా యాంత్రికంగా గడిచిపోతుంది.

పోనీ శిల్పతోనైనా కాస్త కాలక్షేపం చేద్దామంటే ఆమెకు తన నీడే గిట్టదు.

నిర్లిప్తంగా నవ్వుకుందామె.

జీవితం ఎంతటి విచిత్రమైంది.

అందని దానికోసం ఆరాటపడటం, పొందిన దాన్ని పదిల పరచుకోవటం, నిరంతరం దేనికోసమో అన్వేషించడం....

బాధగా నిట్టూర్చింది.

తన పసితనంలో అనాధగా కిరీటి తన ఇంట అడుగు పెట్టిన రోజునే ఎంతగానో ఆకట్టుకున్నాడు.

ప్రతిక్షణం ఏదో సాధించాలని తపించే కిరీటిపై ప్రేమను పెంచుకోగలిగింది. కానీ దానికి ప్రాణం పోయలేక పోయింది.

అందుకే తన ఆశకు భాష కూర్చి ధైర్యంతో తండ్రికి చెప్పే సాహసం లేక తండ్రి చూసిన వ్య క్తి చేతనే తాళి కట్టించుకుంది.

వేదనగా రెండేళ్ళు గడిచిన వైవాహిక జీవితం వివాదంగా ముగిసింది.

వ్యసనాలకు బానిసైన భర్త ఆస్థికోసం తన తండ్రిని హత్య చేయబోయిన సంఘటనలో భర్త చేతినుండి తుపాకీని లాక్కోపోతూ ఆ పెనుగులాటలో భర్త ప్రాణాలనే బలిగొంది.

డబ్బుతో తనను రంక్షించుకోవాలన్న తండ్రి మాటను కాదని ఏరికోరి జైలు జీవితాన్ని గడిపింది.

అదే దిగులుతో తండ్రి మంచంపట్టి ప్రాణాలు వదిలాడని తెలిసినపుడు గుండెలవిసేలా యేడ్చింది. భగవంతుడు నాకు మిదిల్చింది నానీ ఒక్కడేనుకుంటూ శేష జీవితాన్ని గడుపుతోంది.

తన జీవితం యిలా, కిరీటి జీవితం మరోలా విషాదాన్ని అశ్రయించుకుని సాగిపోతున్నాయి.

“కన్యా!” కిరీటి పిలుపుతో ఆలోచనల నుండి తేరుకుంది.

“నానీ ఇంకా రాలేదా...”

“మరో అరగంటకు కానీ రాడు...”

“ఏమిటంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావు....?”

“ఏమి ఆలోచించాలా అని...”

నిర్లిప్తంగా నవ్వింది. కిరీటి ఓ సోఫాలో కూర్చుని ఫెమినా తిరగేస్తూ కిరీటి కొన్ని క్షణాలు గడిపాడు.

"ప్రతి విషయాన్ని ఆలోచిస్తూ కూర్చోవటం వలన ప్రయోజనం ఏమిటి?"

"ఆలోచించక పోవటం వలన కూడా ప్రయోజనం ఏమీ కనిపించటంలేదుగా "

వాతావరణాన్ని తేలికగా మార్చాలని నవ్వుతూ అంది.

"పనిలేక నీ బుర్ర డేవిల్స్ వర్క్‌షాపు అయిపోయినట్టుంది."

"పోనీ ఏమైనా పనిప్పించరాదూ..." కుతూహలంగా అతని కళ్ళల్లోకి చూసింది.

నువ్వు చేయటానికి నా ఫ్యాక్టరీలో పనంటూ ఏం లేదనుకో .... పోనీ ఓ స్కూలు కట్టిస్తాను, మా ఎంప్లాయీస్ పిల్లలకోసం .... దాన్ని నడుపుతావా..."

జోవియల్ గా అన్నాడు.

కాని కన్య జోక్‌గా తీసుకోలేదు... సీరియస్‌గా ఆలోచించిది. తనకు కాలక్షేపం కావాలంటే అదొక్కటే మంచి మార్గం.

కిరీటినెలాగైనా ఒప్పించాలి అని నిర్ణయిచుకుంది.

"నిజం కిరీటి..... త్వరగా ఆపనేదో చేసిపెట్టు.... నాకూ కాస్త ఊబుసు పోయినట్టుంది."

"కన్యా.... నేను సీరియస్‌గా అనలేదు ." నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"కాని నేను సీరియస్‌గా అడుగుతున్నాను. అవును కిరీటి... నేను ఆలోచనలతో పిచ్చి దాన్ని అయ్యేట్టున్నాను. నాకేదో ఒక వ్యాపకం కావాలి.... ప్లీజ్... ఒప్పుకో...." బ్రతిమిలాడింది.

బాగా ఆలోచించిన తర్వాత అంగీకారసూచకంగా తల వూపాడు.... అతని మనసులో యోగేంద్ర మెదిలాడు.

మరుసటి రోజు ఉదయమే యోగేంద్రను తీసుకుని కన్య బంగళాకి బయలు దేరాడు.

కన్యను చూసిన మొదటి క్షణంలోనే గౌరవభావం ఏర్పడింది యోగేంద్రలో.

నిశ్శబ్దంగా, గుంభనంగా ప్రవహించే జీవనదిలా కనిపించిన కన్య గురించి బయలు దేరుతుండగా కిరీటి అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

"మిస్టర్ యోగీ! గుండెల్లో బడవాగ్ని రగులుతున్నా అమృత తారల్ని చిలికించగల సహృదయురాలు నాకు అత్యంత ఆత్మీయురాలు కన్య. మీ ఆలోచనలనుండి ఉద్భవించే ఆ "కట్టడం" ఆమెకు మనశ్శాంతి నివ్వగల ఆశ్రయం కావాలి. ఎంత డబ్బయినా సరే నేను భరిస్తాను."

ముగ్గురూ కలిసి కాలనీకి అనుకున్న రెండెకరాల ఖాళీ జాగాను చూడటానికి వెళ్ళారు.

కిరీటి మాటల్ని ఛాలెంజ్‌గా తీసుకున్న యోగేంద్ర ఊహల్లో అప్పుడే ఓ డిజైన్ రూపం దిద్దుకుంది.

ఓ తెల్లకాగితాన్ని తీసుకుని విస్తీర్ణం తాలూకా కొలతలతో సహా రఫ్‌గా ఓ నమూనాని గీసి యిచ్చాడు.

కంప్యూటర్‌లా అతివేగంగా ఆలోచించగల యోగేంద్ర మేధాశక్తికి ఆశ్చర్యపోయాడు కిరీటి

నమూనా చూసిన కన్య కూడా కిరీటితో పాటుగా తృప్తి పడింది.

"మేడమ్... మీరలా చూస్తుండండి..... అతి తక్కువకాలంలో ఐమీన్ నేను తిరిగి వెళ్ళేలోగా బ్రహ్మాండమైన బిల్డింగ్ కట్టిస్తాను. ఆనక అది హైస్కూల్‌గా కాలేజిగా కూడా మారటానికి గల అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని మరీ ప్లాన్ చేస్తాను. ఏమిటలా ఆశ్చర్యపోతున్నారు. ఆనక విషయం నాకిప్పుడే యెలా తెలిసిందా అనికదూ.... యస్ ఇట్స్‌ట్రూ..... ఎందుకని అడగరేం." హుషారుగా అన్నాడు.

"ఎందుకని ?" అడక్కుండా ఉండలేకపోయింది కన్య.

"మన హస్తవాసి అలాంటిది"

టక్కున జవాబిచ్చేసరికి కన్యతో పాటు కిరీటి కూడా నవ్వాపుకోలేక పోయాడు.

"మీకు తెలీదేమో ... నా చిన్నతనంలో మంచాన్నెప్పుడూ అతుక్కుని పడుంటే మా నాన్నమ్మా యోగీ నాకు ఒంట్లో బాగులేదురా" అంటే "అలాగా నాన్నమ్మా" అంటూ అర్జెంటుగా అనాసిన్ టాబ్లెట్టు తెచ్చియిచ్చి యిది ఇంపోర్టెడ్ మెడిసెనే అని అబద్ధం ఆడేసేవాడ్ని, పాపం పిచ్చి నమ్మకంతో మాత్రల్ని మింగి మరో అయిదు నిమిషాలకల్లా లేచి కూర్చునేది. "ఒరే మనవడా నీ హస్తవాసి చాలా మంచిది" డాక్టరువి కమ్మని ఒకటే మొరాయించేది. అలా గాలి మేడలు కడుతూ బ్రతికిన నేను అనుకోకుండా యస్సెసెల్సీలో మేథమెటిక్స్ తీసుకుని వట్టి మేడలు కట్టే ఇంజనీరునై పోయాను..."

నిశ్చేష్టులైన ఆ ఇద్దరివేపు తేరిపార చూసి, "చాలా బోర్ కొట్టించాననుకుంటాను" అని ఇబ్బందిగా మొహం పెట్టే సరికి ఫకాలున నవ్వింది కన్య.

అలా నవ్విన కన్యలో ఒకనాటి కన్యగా ఉన్న కన్యను చూశాడు కిరీటి.

"ఎల్లకాలం నువ్విలాగే నవ్వాలి కన్యా" అనుకున్నాడు మనసులో.

"మేడమ్ మీరు నన్ను క్షమించాలి... నాకు సెల్ఫ్ బోస్టింగ్ జాస్తి.... పైగా నా మాటల్ని వింటూ స్నేహితులు "చాటర్ బాక్స్" అని కూడా అంటూంటారు" సీరియస్‌గా అన్నాడు.

"అయితే మీ స్నేహితురాలు చాలా నిజాయితీ పరులన్న మాట!" అనేసింది టక్కున.

"అమ్మో పేల్చేశారు." యోగేంద్ర నవ్వుతో కిరీటి కూడా శృతి కలిపేశాడు.

కిరీటి, యోగేంద్రలు ఇంటిదగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాక చాలా సేపటి వరకు యోగేంద్ర గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది కన్య.

నిర్మలమైన అతని వ్యక్తిత్వం ఆమెకెంతో నచ్చింది.

సహజంగా ముభావంగా వుండే తను ఒక్కరోజు పరచయంతోనే యోగేంద్రను ఇంత ఎక్కువగా ఎందుకు గుర్తు చేసుకుంటున్నాను అన్న ఆలోచన రాగానే బెరుకుతోనూ, బిడియంతోనూ ముడుచుకుపోయింది.

కష్టమర్స్ తరుపు నుండి వచ్చిన డెలిగేషనుకు అప్సరాలో విందు ఏర్పాటు చేశాడు కిరీటి.

పెద్దగా అలవాటు లేకపోయినా కంపెనీ కోసం హాట్ డ్రింక్ పుచ్చుకున్నాడు.

రాత్రి పది గంటలయ్యే సరికి పార్టీ ముగియటంతో వి.ఐ.పి.లనందరినీ హోటలుకు పంపి నిమిషాలలోనే జాగ్రత్తగా కారు డ్రైవ్ చేసుకుంటూ బంగళాకి తిరిగి వచ్చాడు.

కడుపులోని 'రాయల్ సెల్యూట్' మైకంతో మొత్తం శరీరాన్ని ఊపేస్తుంటే తూలుకుంటూ గదిలోకి వచ్చాడు.